ఈనాడు
ఆదిలాబాద్
శనివారం అక్టోబరు 5, 2024

చిత్ర మాయ



ఈ చిత్రంలో కనిపిస్తున్న నీటి కోడి(పర్పుల్ వాటర్ హెన్)కు మూడు కాళ్లు ఉన్నట్లుగా కనిపిస్తుంది కదూ. సాధారణంగా పక్షులకు రెండు కాళ్లు ఉంటాయి. ఈ నీటి కోడికి మూడు ఉండటం ఏమిటా అని మీ సందేహం కదా.. ఈ కోడి పక్కనే మరొకటి ఉంది. అవతల ఉన్న కోడి మనకు కనిపించకుండా కేవలం కాళ్లు మాత్రమే చిత్రంలో కనిపిస్తోంది. ఆదిలాబాద్ పట్టణం చాంద సమీపంలోని చెరువులో కనిపించిందిలా. **- ఈనాడు, ఆదిలాబాద్**

సర్వే పకడ్బందీగా చేపట్టాలి



వివరాల నమోదును పరిశీలిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

ఇచ్చోడ, న్యూస్‌టుడే : ఇంటింటి సర్వేను పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. శుక్రవారం ఇచ్చోడ మండలం అడెగామ(బి)లో డిజిటల్ కార్డుల జారీ కోసం నిర్వహిస్తున్న సర్వేను తనిఖీ చేశారు. ఎలాంటి తప్పులు లేకుండా నమోదు చేయాలని సూచించారు. అధికారులు చేపడుతున్న సర్వే వివరాలను పరిశీలించారు. ఎంపీడీఓ లక్ష్మణ్, తహసీల్దార్ సత్యనారాయణ, డీటీ రమేష్, ఆర్ఐ హుస్సేన్, తదితరులు ఉన్నారు.

నేడు దివ్యాంగులకు బస్సు పాస్ మేళా

ఆదిలాబాద్ అర్బన్, న్యూస్‌టుడే : ఇచ్చోడ మండల పరిషత్తు కార్యాలయంలో శనివారం దివ్యాంగులకు ఆర్టీసీ బస్సు పాస్ మేళా నిర్వహించనున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజరు కల్పన ఒక ప్రకటనలో తెలిపారు. దివ్యాంగులు సదరం ధ్రువపత్రం, ఆధార్ కార్డు, పాస్‌ఫొటో తీసుకురావాలని, రూ.50 చెల్లించి 50 శాతం రాయితీ బస్సు పాసును పొందాలని కోరారు.


భాషపై పట్టు.. మార్కులు కొట్టు

దండేపల్లి, న్యూస్‌టుడే

పదో తరగతి పరీక్షలకు మరో అయిదు నెలల సమయం ఉన్నా. ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా కష్టపడి చదివితేనే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చు. చాలా మంది విద్యార్థులు ఆప్షనల్ సబ్జెక్టులను బాగా సాధన చేస్తూ భాష విషయాలను పట్టించుకోరు. దీంతో జీపీఏ తగ్గే అవకాశముంది. మంచి జీపీఏ సాధించాలంటే అన్ని సబ్జెక్టులపై అవగాహన కలిగి ఉండాలి. ఈ నేపథ్యంలో తెలుగు, హిందీ, ఆంగ్లం ఉపాధ్యాయులు అందజేస్తున్న సూచనలు ఇలా...



వ్యాకరణం.. పద్యసాధనతో ఉత్తమ ఫలితం



తెలుగు..

చుక్క గుర్తు పెట్టిన పద్యాలు రాసి వాటి భావాలు, ప్రతిపదార్థం, కవి పరిచయం, రచనాశైలిపై అవగాహన పెంచుకోవాలి. పాదభంగం లేకుండా పద్యం పూరించి భావం రాస్తే ఐదు మార్కులు ఖాయం.

- పద్య, గద్య ఉపవాచకాల నుంచి 6 వ్యాసరూప ప్రశ్నలుంటాయి. ఛాయిస్ పోనూ మూడింటికి సమాధానం రాస్తే 21 మార్కులు వస్తాయి. కథానిక, కథ, కవిత, గేయం, పాట, ఆహ్వానపత్రం, ముఖాముఖి ప్రశ్నావళి, అభినందన పత్రం, నాటకం, నాటిక, సంభాషణ, ప్రకటనలు, కరపత్రం తయారు చేయడంపై పట్టు సాధిస్తే ఏడు మార్కులు సాధిస్తారు..
- పదజాలం, సంధులు, సమాసాలు, అలంకారాలు, గణవిభజన, వాక్యాలను సాధన చేయాలి.
- పద్య భాగంలోని భిక్ష, దానశీలం, శతక మధురిమ పాఠ్యాంశాల నుంచి ఎక్కువ ప్రశ్నలు అడిగే అవకాశముంది.
- అపరిచిత (పుస్తకంలో లేనిది) పద్యం, గద్యం ఇచ్చి దీని కిందనే ప్రశ్నలు ఉంటాయి. వీటిని అవగాహన చేసుకుని జవాబులు రాస్తే పది మార్కులు వస్తాయి.
- తెలుగులో దస్తూరి బాగుండటంతో పాటు అక్షర దోషాలు లేకుండా రాయగలగాలి.



బి.హరిచరణ్, తెలుగు భాషోపాధ్యాయుడు, ఉన్నత పాఠశాల తేజాపూర్, ఆదిలాబాద్ జిల్లా

భాషపై అవగాహన ముఖ్యం

హిందీ..

పఠిత, అపఠిత గద్యాంశాలు, పద్యాంశాలు నేర్చుకుంటే 20 మార్కులు వస్తాయి. వ్యాకరణంలో భాషాభాగాలు, వ్యతిరేక పదాలు, సమానార్థాలు, వచన్, ఉపసర్గ్, ప్రత్యయ్, పునరుక్తి శబ్దాలు, మహావరాల నుంచి 20 మార్కులు. పద్య, గద్య భాగాలలోని ముఖ్యమైన పాఠ్యాంశాల సారాంశాలను సొంత మాటల్లో రాసేలా అభ్యాసం చేయాలి. ఉపవాచకంలోని గద్యాంశాలపై దృష్టి పెడితే మంచి మార్కులు వస్తాయి. ప్రతి పాఠంలోని కవి పరిచయాల సాధన తప్పనిసరి.

- పాదభంగం లేకుండా చూడాలి. డైరీ, పోస్టర్, సంవాదం, సూచన, లేఖలు, కరపత్రం తయారీ, నిబంధ్ పై సాధన చేయాలి.



కె.వామన్‌రావు, హిందీ ఉపాధ్యాయుడు, జైనూర్ ఉన్నత పాఠశాల కుమురం భీం జిల్లా

పదజాలంపై పై దృష్టి సారించాలి



ఆంగ్లం..

ప్రశ్నపత్రం పార్ట్ ఏ, బీ విభాగాలుగా ఉంటుంది. 'ఏ'లో రెండు మైనర్ డిస్కోర్స్‌లు, ఒక మేజర్ డిస్కోర్స్ ఉంటాయి. మైనర్‌లో మెసేజ్‌లు, డైరీ, నోటీసులు, పోస్టర్, ఇన్విటేషన్, ప్రొఫైల్ ఉంటాయి. వీటిని సాధన చేస్తే పది మార్కులు వస్తాయి. మేజర్‌లో లేఖలు, బయోగ్రఫీ, కొరియోగ్రఫీ, కన్వర్షేషన్, న్యూస్ రిపోర్ట్, ఇంటర్వ్యూ, తదితర అంశాలు ఉంటాయి. వీటిని సాధన చేస్తే 10 మార్కులు.. అంటే మొత్తం కలిపి 20 మార్కులు వచ్చినట్టే. అదే విధంగా రెండు ప్యాసేజీలు ఉంటాయి. వీటిని చదివి ప్రశ్నలకు జవాబులు రాస్తే 24 మార్కులతో మొత్తం పార్ట్ ఏలో 60 మార్కులుంటాయి.

- పార్ట్ బిలో వ్యాకరణం, ఎడిటింగ్, తప్పులను సవరించడం (కరెక్టింగ్ ఎర్రర్స్), పద్యం చదివి ప్రశ్నలకు సమాధానాలు రాస్తే పది మార్కులు సాధించవచ్చు. పుస్తకంలో లేని ప్యాసేజీ ఇచ్చి దీనిని చదివి మల్టీపుల్ ఛాయిస్‌లో ప్రశ్నలుంటాయి. వీటికి 20 మార్కులుంటాయి.
- వ్యాకరణం, తప్పులు లేకుండా రాయడం, ప్యాసేజీలు అవగాహన చేసుకుని జవాబులు రాస్తే మంచి జీపీఏ సాధించవచ్చు.



రమాబిందు, ఆంగ్ల ఉపాధ్యాయురాలు, వెల్గనూర్ ఉన్నత పాఠశాల, మంచిర్యాల జిల్లా



సావర్‌గామ్‌లో అసంపూర్తిగా రెండు పడక గదుల ఇళ్లు

ఇళ్ల నిర్మాణం పూర్తయ్యేనా?

తాంసి మండలం సావర్‌గామ్‌లో గత ప్రభుత్వం 20 రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణానికి రూ.కోటి కేటాయించింది. 2023 జనవరి 22న నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. గుత్తేదారు గోడల వరకు నిర్మాణం పూర్తి చేసి, బిల్లు రావడం లేదంటూ అసంపూర్తిగా వదిలేశారు. ఏడాది దాటినా పనులు మాత్రం ముందుకు సాగక లబ్ధిదారులు ఇంటి నిర్మాణం కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది. **- న్యూస్‌టుడే, తాంసి**

సోయా కొనుగోళ్లు ప్రారంభం



పాలనా ప్రాంగణం, న్యూస్‌టుడే : ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్‌యార్డులో సోయా కొనుగోళ్లను శుక్రవారం ఎమ్మెల్యే పాయల్ శంకర్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందించే మద్దతు ధర రూ.4,892కే విక్రయించాలని, దళారులను నమ్మి మోసపోవద్దని రైతులకు సూచించారు. డీసీసీబీ ఛైర్మన్ అడ్డి భోజారెడ్డి మాట్లాడుతూ జిల్లాలో తొమ్మిది కేంద్రాల్లో సోయా కొనుగోళ్లు ప్రారంభించామన్నారు. ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా రైతులు తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. అదనపు పాలనాధికారి శ్యామలదేవి, మార్క్‌ఫెడ్ డీఎం ప్రవీణ్‌రెడ్డి, సహకార అధికారి మోహన్, మార్కెటింగ్ అధికారి గజానన్ తదితరులు పాల్గొన్నారు.


నేడు ఉద్యోగ మేళా

ఎదులాపురం, న్యూస్‌టుడే : తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ జిల్లాలోని నిరుద్యోగులకు విదేశాల్లో ఉద్యోగావకాశాలు కల్పించటానికి శనివారం స్థానిక ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఉద్యోగ మేళాను నిర్వహించనున్నట్లు ఉపాధి కల్పనాధికారి మిల్కా ఒక ప్రకటనలో తెలిపారు. గల్ఫ్ దేశాలతో పాటు ఆస్ట్రేలియా, కెనడా, జర్మనీ, హంగేరీ, జపాన్, పోలాండ్, రొమేనియా, యూకే వంటి దేశాల్లో బైక్ రైడర్స్, డెలివరీ బాయ్స్‌కు అధిక డిమాండ్ ఉందన్నారు. అభ్యర్థులు ఎస్ఎస్‌సీ ఉత్తీర్ణులై 21 నుంచి 40 ఏళ్ల మధ్య వయసుండాలని, ఏదైనా ఫుడ్ డెలివరీలో అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యం ఉంటుందన్నారు. ఆసక్తి, అర్హత ఉన్న అభ్యర్థులు నేరుగా హాజరు కావాలని సూచించారు. వివరాలకు 94400 51285, 94400 51452 నెంబర్లను సంప్రదించవచ్చన్నారు.

పత్తి పంటలో మానసిక ఒత్తిడి

ఆధునిక సమాజంలో మనిషి ఎదుగుదలతో పాటు మానసిక ఒత్తిడి పెరుగుతోంది. దాన్ని అధిగమిస్తే తప్ప నిలదొక్కుకోవటం కష్టమవుతోంది. ఇది మనుషులకే కాదు చేలోని పంటల్లోనూ కనిపిస్తోంది. ప్రధానంగా 45 రోజుల దశకు చేరుకునే పత్తి పంటలోనూ మానసిక ఒత్తిడి పెరుగుతోంది. పసిగట్టి నివారించాల్సి వైద్యుడు రైతే. పత్తి పంటకు మానసిక ఒత్తిడా? అనేది నమ్మశక్యంగా లేదు. కానీ నమ్మితీరాల్సిందే అంటున్నారు వ్యవసాయ శాస్త్రవేత్తలు. ఇంతకీ పత్తి పంటలోని మానసిక ఒత్తిడికి కారణాలేమిటి? నివారణ ఏమిటి? అనేదానిపై ఆదిలాబాద్ వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డా.రాంప్రసాద్‌తో 'ఈటీవీ-ఈనాడు' ప్రత్యేక ముఖాముఖి.





కుంగుబాటుకు గురైన పత్తిని చూపిస్తున్న శాస్త్రవేత్త రాంప్రసాద్

- వాతావరణ సమతుల్యత లోపమే ప్రధాన కారణం

వ్యవసాయ ప్రధాన శాస్త్రవేత్తతో 'ఈటీవీ-ఈనాడు'



ఈటీవీ – ఆదిలాబాద్

ఈ : సహజంగా మనిషిలో ఉండే మానసిక ఒత్తిడి పత్తి పంటలోనూ ఉంటుందనేది కొత్తగా వినిపిస్తోంది. నిజమేనా? దానికి కారణాలేమిటి?

రాంప్రసాద్ : ముమ్మాటికీ నిజమే. ప్రాణమున్న అన్ని జీవుల మాదిరిగా పంటల్లోనూ మానసిక ఒత్తిడి ఉంటుంది. ప్రధానంగా పత్తిలో స్పష్టంగా కనిపిస్తోంది. యవ్వన, వృద్ధాప్య దశలో వివిధ సమస్యలతో బాధపడే మనుషుల్లో కుంగుబాటుకు గురైనట్లే పత్తిపంట 40 రోజుల దశదాటిన తర్వాత రెండు రకాల ఒత్తిళ్లకు గురవుతుంది. అందులో మొదటిది అధిక వర్షపాతంతో ఊపిరాడకుండా గురయ్యే ఒత్తిడైతే, నీటి ఎద్దడి కారణంగా పోషకాలు లభించకుండా కుంగుబాటుకు గురయ్యే ఒత్తిడి రెండోది.

ఈ : మనుషులైతే తమ బాధలు, సమస్యలను వైద్యులకో, స్నేహితులకో వివరించి ఉపశమనం పొందవచ్చు. పత్తి పంట తన బాధను ఎలా వివరిస్తుంది. మనం ఎలా పసిగట్టవచ్చు?

రాం : మీరనేది నిజమే! మనుషులు తమ బాధలను మాటల ద్వారా వెల్లడిస్తారు. కుంగుబాటుకు గురయ్యే పత్తి పంట కూడా నేను ఒత్తిడిలో ఉన్నానని సాగుచేసే రైతులకు పెరుగుదల రూపంలో సంకేతం ఇస్తుంది. అదెలాగంటే నీరు ఎక్కువైనా, తక్కువైనా ఏపుగా పెరిగిన మొక్కలు సాయంత్రం తర్వాత మోడువారినట్లు కనిపిస్తాయి. గాలివీచినా కదిలినట్లుగా అనిపించవు. ఆకులు తలవాల్చి వడలిపోయినట్లు ఉంటాయి. క్రమంగా పూత, కాత రాలిపోతుంది. జీవంలేని మొక్కలుగా మారుతాయి. ఇవన్నీ ఇతరులకు తెలియకపోవచ్చు. రైతులకు తెలిసిన అంశాలే.

ఈ : కుంగుబాటుకు గురైన పత్తి పంటను ఎలా కాపాడుకోవచ్చు?

రాం : వ్యవసాయం చేసే ప్రతి రైతు పంటల యోగక్షేమాలను గుర్తించగలిగే వైద్యుడే. పత్తి పంటనే కాదు. ఏ పంటలో ఏ మార్పు వచ్చిందో? ఏం చేయాలో? ఎలా రక్షించుకోవాలో తెలిసిన జ్ఞానే. మేం చెప్పే సూచనల ప్రకారమైతే చేలోని పంటలకు అధిక నీటి నిల్వతో ఇబ్బంది లేకుండా చూసుకోవాలి. కాస్తంత తడి ఉండేలా చూసి ప్రతి 20 రోజులకోసారి ఎకరాకు 20 నుంచి 25 కిలోల యూరియా, 10 నుంచి 15 కిలోల పొటాష్‌ను మొక్క నేలభాగంలో వేయాలి. పూత, కాత రాలకుండా 10 రోజులకోసారి 13-0-45(పొటాషియం నైట్రేట్) పొడిని లీటరు నీటికి 10 గ్రాముల చొప్పున తెగుళ్ల, పురుగు మందులతో కలిపి పిచికారీ చేయాలి. ఇలా చేయటం ద్వారా పంటలను మానసిక ఒతిళ్ల నుంచి కాపాడుకోవటానికి దోహదం చేస్తుంది.

ఈ : ఇప్పుడున్న పంటల పరిస్థితి ఎలా ఉంది? మొక్కలు ఒత్తిళ్లకు గురికాకుండా రైతుకు దిగుబడులు తగ్గకుండా ఏం చేయాలి?

రాం : పత్తి పంట అంటే పసికందును సాకినట్లే. ప్రస్తుతం 90 రోజుల దశలో ఉన్న పంటను 140 రోజుల వరకు కాపాడుకోవాల్సిందే. మొక్కలు కుంగుబాటుకు గురికాకుండా క్రమం తప్పకుండా పోషకాలు అందిస్తే అనుకున్న దిగుబడి సాధించవచ్చు. మరో 10, 15 రోజుల్లో ఒకటి, రెండు వర్షాలు కురిస్తే బాగుంటుంది.

12 అడుగుల 'పెద్ద జొన్న'



పెద్ద జొన్న మొక్కను చూపుతున్న జంగుబాయి

ఆదివాసీలు 20 ఏళ్ల కిందట సాగు చేసే 'పెద్ద జొన్న' పంట కనుమరుగైంది. ఆదిలాబాద్ గ్రామీణ మండలం లోహర శివారులో మర్సుకోల రాంషా చేనులో పెద్ద జొన్న మొక్కను వచ్చే ఏడాది విత్తనాల కోసం పెంచుతున్నాడు. ఈ జొన్న మొక్క దాదాపు 12 అడుగుల ఎత్తు పెరగడంతో పాటు కంకి వేసింది. పెద్ద జొన్న కంకిని ప్రాణం కంటే ఎక్కువగా చూసుకుంటున్నామని రాంషా భార్య జంగుబాయి అన్నారు. వచ్చే ఏడాది పెద్ద జొన్న పంట సాగు చేసేందుకు ఒక కంకి విత్తనాలు దాదాపు అరకిలో పైగా వస్తాయన్నారు. వాటిని సాగు చేసి మరో సంవత్సరం రెండు ఎకరాలలో పంట సాగు చేసి పెద్ద జొన్న పంటను కాపాడుకుంటామంటున్నారు. **- న్యూస్‌టుడే, ఇంద్రవెల్లి**

ఓపెన్‌స్కూల్ ప్రవేశాల గడువు పొడిగింపు

పాలనాప్రాంగణం, న్యూస్‌టుడే : ఓపెన్‌స్కూల్ పదో తరగతి, ఇంటర్ ప్రవేశాల గడువును ఈ నెల 31వ తేదీ వరకు పొడిగించినట్లు డీఈవో ప్రణీత తెలిపారు. అధ్యయన కేంద్రాల కో-ఆర్డినేటర్లు, మండల విద్యాధికారులు, ఉపాధ్యాయులు విస్తృత ప్రచారం చేసి ప్రవేశాల సంఖ్యను పెంచాలని సూచించారు.

మూడో రోజు 134 మంది హాజరు

పాలనాప్రాంగణం, న్యూస్‌టుడే : డీఎస్సీకి ఎంపికైన అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన మూడోరోజుకు చేరుకుంది. రాష్ట్ర పరిశీలకులు, ఓపెన్‌స్కూల్ సంయుక్త సంచాలకులు ఎం.సోమిరెడ్డి డైట్ కళాశాలలో కొనసాగుతున్న ధ్రువపత్రాల ప్రక్రియను పరిశీలించారు. ధ్రువపత్రాలను క్షుణ్ణంగా పరిశీలించాలని పర్యవేక్షక బృందాలకు సూచించారు. శుక్రవారం 134 మంది హాజరయ్యారు. గడిచిన మూడు రోజుల్లో ఎస్జీటీలు 354 మంది, స్కూల్ అసిస్టెంట్లు 93 మంది, స్పెషల్ ఎడ్యుకేషన్ ఎస్ఏ ఒకరు, లాంగ్వేజి పండితులు 21, పీఈటీలు ముగ్గురుతో కలిసి మొత్తం 472 మంది ఇప్పటివరకు పరిశీలనకు వచ్చినట్లు డీఈవో ప్రణీత వివరించారు.

డీఎడ్ అభ్యర్థులకు అవకాశం

గురువారం విడుదలైన డీఎడ్ పరీక్ష ఫలితాల్లో ఉత్తీర్ణులైన అభ్యర్థుల్లో ఎవరైనా డీఎస్సీ-2024లో 1:3 నిష్పత్తి జాబితాలో పేరు ఉంటే అలాంటివారు శనివారం జరిగే ధ్రువపత్రాల పరిశీలనకు డైట్ కళాశాలకు రావాలని డీఈవో ప్రణీత సూచించారు.

డీఎస్సీలో స్థానికత కలకలం

పాలనాప్రాంగణం, న్యూస్‌టుడే

డీఎస్సీ-2024 ఫలితాల్లో ఎంపికైన అభ్యర్థులు ఉపాధ్యాయ కొలువు ఎలాగైనా సొంతం చేసుకోవాలని దొడ్డిదారిని ఎంచుకోవడం కలకలం రేపుతోంది. స్థానికతను నిరూపించేందుకు తప్పుడు ధ్రువపత్రాలను సమర్పించడమే ఇందుకు నిదర్శనం. ఆదిలాబాద్ డైట్ కళాశాలలో మూడు రోజులుగా డీఎస్సీకి ఎంపికైన పలు అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలనలో నకిలీలు వెలుగుచూడటం చర్చనీయాంశంగా మారుతోంది. సమయం తక్కువగా ఉండటంతో అధికారులు ఫిర్యాదులపై నామమాత్రపు విచారణతో మమ అనిపించడం అర్హులైన అభ్యర్థులను కలవరానికి గురిచేస్తోంది. నకిలీ పత్రాలపై ఆదిలోనే విచారించి వారి దరఖాస్తులను తిరస్కరిస్తే తమకు అవకాశం వస్తుందని సంబంధీకులు వాపోతున్నారు.



ఒకటి నుంచి ఏడో తరగతి వరకు ఎక్కడైతే నాలుగు సంవత్సరాలు చదివి ఉంటారో ఆ జిల్లాను స్థానికతగా పరిగణిస్తారు. ఉన్నత చదువుల నిమిత్తం ఎక్కడెక్కడో చదివిన వారు తాము ఇదే జిల్లావాసులమని నకిలీ ధ్రువపత్రాలు తీసుకొస్తున్నారు. దీనికితోడు జిల్లా మహారాష్ట్ర సరిహద్దును కలిగి ఉండటంతో చాలామంది అక్కడి వారు ఇక్కడికి వలస వచ్చి మైనర్ మాధ్యమాల్లో ఉద్యోగాలను నకిలీ పత్రాలతో దక్కించుకోవాలని పక్కదారి పడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.


రూ.20 లక్షలు ఇస్తాం

డీఎస్సీకి ఎంపికై మొదటి వరుసలో ఉన్న ఓ అభ్యర్థి ఇప్పటికే ప్రభుత్వ ఉద్యోగంలో కొనసాగుతున్నాడు. 1:3 ప్రాతిపదికన అభ్యర్థులను ఎంపిక చేయడంతో ప్రభుత్వ ఉద్యోగం కలిగిన అభ్యర్థి సర్టిఫికెట్ల పరిశీలనకు గైర్హాజరైతే తనకు ఉద్యోగం వస్తుందని భావించిన మరో అభ్యర్థి ఏకంగా రూ.15 నుంచి రూ.20 లక్షలు ఇచ్చేందుకు బేరసారాలు చేసినా సదరు అభ్యర్థి సున్నితంగా తిరస్కరించారు.

నకిలీవని తేలితే ఉద్యోగం ఊడుతుంది


అభ్యర్థులు సమర్పించిన ధ్రువపత్రాలు నకిలీవని తేలితే వారిని ఉద్యోగం నుంచి తొలగించడంతో పాటు క్రిమినల్ కేసులు నమోదవుతాయని డీఎస్సీ ధ్రువపత్రాల రాష్ట్ర పరిశీలకులు ఎం.సోమిరెడ్డి స్పష్టంచేశారు. ఒకవేళ ప్రస్తుతం ఎంపికై నియామకపత్రం పొందిన విచారణ అనంతరం ఉద్యోగానికి అనర్హులుగా ప్రకటిస్తారన్నారు. అభ్యర్థులు తప్పుడు మార్గంలో నకిలీ ధ్రువపత్రాలు సమర్పించి భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని హితవుపలికారు.


ఒక పాఠశాల.. రెండు పత్రాలు



డీఎస్సీ ఎంపిక జాబితాలో చోటు దక్కించుకున్న ఓ అభ్యర్థిని ఎస్జీటీ కేటగిరిలో మొదటి ర్యాంకు సాధించింది. ఉట్నూరులో తాను చదివిన ప్రైవేటు పాఠశాల పేరిట జారీ చేసిన రెండు బోనఫైడ్ పత్రాలను దరఖాస్తుకు జత చేసింది. వాటిని చూసి పరిశీలన బృంద సభ్యులు అవాక్కయ్యారు. ఆ రెండింటిలో అడ్మిషను నెంబరు, పుట్టిన తేదీ, తండ్రి పేరులోని తప్పులు గుర్తించారు. ఇదేంటని ప్రశ్నిస్తే సదరు అభ్యర్థిని ఆ పత్రాలు తప్పుగా ఉన్నాయని వెంట తెచ్చుకున్న మరో పత్రాన్ని సమర్పించారు. ఈ విషయం తెలిసిన మరో అభ్యర్థిని అధికారులకు ఫిర్యాదు చేసి మొదటి ర్యాంకరు బోనాఫైడ్‌లను మరోమారు పరిశీలించాలని విన్నవించారు.

రిజిస్టరులో తండ్రి పేరు మార్చారు






మరాఠీ మాధ్యమంలో డీఎస్సీ ఎస్జీటీ విభాగంలో ఓ అభ్యర్థిని ఎంపికైంది. ఆదిలాబాద్ పట్టణంలో ఓ ప్రభుత్వ పాఠశాలలో చదివినట్లు ఆమె సమర్పించిన పత్రాలు నకిలీవని, అసలు ఆమె మహారాష్ట్రలో చదివినట్లు మరో అభ్యర్థి ఫిర్యాదు చేశారు. స్పందించిన డీఈవో పాఠశాల నుంచి రిజిస్టరు తెప్పించి పరిశీలించాలని సిబ్బందిని పురమాయించారు. సదరు అభ్యర్థిని ఇంటి పేరు, తండ్రి పేరు కొట్టివేసినట్లు ఉంది.

విహంగాల అందం.. అడవితో అనుబంధం


మామడ మండలం నల్దుర్తి అటవీ ప్రాంతంలో పక్షులను వీక్షిస్తున్న అధికారులు


ఆకట్టుకునే అందం వెంగన్న చెరువు సొంతం


జపం చేస్తున్నట్లు..


దీర్ఘాలోచనలో..


రామసక్కని చిలుకలు




కొనితెచ్చి పెట్టిన బొమ్మ కాదండోయ్.. నల్దుర్తి అడవిలో కనిపించిన పక్షి


ఆకాశంలో విహరిస్తూ..


దసరాకు ముందే పాలపిట్ట వచ్చేసింది

అటవీశాఖ ఆధ్వర్యంలో 70వ వన్యప్రాణి వారోత్సవాలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం ఆ శాఖ అధికారులు మామడ మండలం నల్దుర్తి అటవీ ప్రాంతంలోని రెండు పురాతన చెరువుల పరిధిలో పర్యటించారు. అధునాతన కెమెరాలతో పక్షులను వీక్షించారు. ఆ అటవీ ప్రాంతంలోని తుర్కం, వెంగన్న చెరువు ప్రాంతాలకు వలస వచ్చే పలు రకాల పక్షులు, ఆవరణ వ్యవస్థలో వాటి పాత్ర వంటి వాటిపై అధికారులు సిబ్బందికి అవగాహన కల్పించారు. వారు కెమెరాలో బంధించిన చిత్రాలను చూస్తే మన దగ్గర ఇంత అందమైన పక్షులున్నాయా? అని ఆశ్చర్యపోతాం. అటవీ క్షేత్రాధికారులు రామకృష్ణ, శ్రీనివాస్‌రావు, వేణుగోపాల్, ఉప అటవీ క్షేత్రాధికారి నజీర్‌ఖాన్, మామడ, దిమ్మదుర్తి రేంజ్‌ల సిబ్బంది ఉన్నారు. - న్యూస్‌టుడే, మామడ

పసిపాప ఆకలి తీర్చేందుకు
6 కిలోమీటర్ల కాలినడక

● బేల మండలంలో దయనీయ పరిస్థితి..



పసిపాపకు డబ్బా పాలు తాగిస్తున్న కొడప మోతుబాయి



సాంగ్వి నుంచి పాల డబ్బాను తీసుకొస్తున్న అమ్మమ్మ కొడప లచ్చుబాయి

పుట్టిన 23 రోజులకే తల్లిని కోల్పోయిన పసిపాపను బతికించుకునేందుకు అమ్మమ్మ, అమ్మమ్మ అత్తయ్యలు పడరాని పాట్లు పడుతున్నారు. పసిపాప ఆకలి తీర్చేందుకు పాల డబ్బా కోసం గూడెం నుంచి రానుపోనూ 6 కి.మీ దూరం ప్రయాణిస్తున్నారు. ఆదిలాబాద్ జిల్లా బేల మండలం దుబ్బగూడ పంచాయతీ టెంబిరిగూడకు చెందిన దేశ్‌ముఖ్ మారుబాయికి ఆగస్టు 20న సొంత గ్రామంలో ప్రసవమైంది. ఆడపిల్లకు జన్మనిచ్చింది. సెప్టెంబరు 10న అనారోగ్యానికి గురికావడంతో భర్త దేశ్‌ముఖ్ లస్మ, గ్రామస్థులు ఆదిలాబాద్ రిమ్స్‌కు తీసుకెళ్లారు. వైద్యుల సూచనల మేరకు హైదరాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మారుబాయి సెప్టెంబరు 13న మృతి చెందినట్లు భర్త తెలిపారు. హైదరాబాద్ నుంచి రూ.12 వేలు ఖర్చు చేసి శవాన్ని తీసుకొచ్చామని, అదే రోజు ఐటీడీఏ పీఓ ఖుష్బూ గుప్తా రూ.20 వేల ఆర్థిక సాయం అందించారని అన్నారు. భార్య మృతి విషయం తెలిసిన అభిమన్యూ వాట్సాప్ గ్రుపు నిర్వాహకుడు మెస్రం శేఖర్‌బాబు పాప పాల కోసం రూ.30 వేలు అందజేశారు. మూడు రోజులకు ఒకసారి రూ.280 పాల డబ్బా కొనుగోలు చేసి పాలు తాగిస్తూ పాపను బతికించుకుంటున్నామని అమ్మమ్మ లచ్చుబాయి అన్నారు. పాప పాల డబ్బా కోసం టెంబిరిగూడ నుంచి సాంగ్వి వరకు మూడు రోజులకు ఒకసారి రానుపోనూ 6 కి.మీ దూరం కాలినడకన వాగు దాటి వెళ్తున్నామని అన్నారు. పాల డబ్బా కోసం వెళ్లిన సమయంలో వచ్చే వరకు తన అత్తమ్మ కొడప మోతుబాయి ఆలనాపాలనా చూసుకుంటోందన్నారు. ప్రభుత్వం, దాతలు స్పందించి పాలిచ్చే ఆవును ఇస్తే పాప కష్టాలు తీరుతాయని వృద్ధులు వేడుకుంటున్నారు.
- న్యూస్‌టుడే - ఇంద్రవెల్లి, బేల

బ్రహ్మచారిణి రూపంలో బాసర అమ్మవారి దర్శనం



ముథోల్(బాసర), న్యూస్‌టుడే: బాసర అమ్మవారి ఆలయంలో రెండు రోజుల కిందట ప్రారంభమైన నవరాత్రి ఉత్సవాలు శుక్రవారం కొనసాగాయి. రెండో రోజు బ్రహ్మచారిణి రూపంలో అమ్మవారు దర్శనమిచ్చారు. తెలుగు రాష్ట్రాలతోపాటు పొరుగు రాష్ట్రమైన మహారాష్ట్ర నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అమ్మవారి సన్నిధిలో దీక్షలు తీసుకున్న వారందరూ మధ్యాహ్నం ప్రత్యేక పూజలు చేశారు.

గంగనీళ్ల జాతరకు ఏర్పాట్లు పూర్తి

దిలావర్‌పూర్, న్యూస్‌టుడే: ఏటా మహాలయ అమావాస్య తర్వాత వచ్చే శని, ఆదివారాల్లో నిర్వహించే గంగనీళ్ల జాతరకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. సారంగాపూర్ మండలంలోని అడెల్లిలో కొలువైన పోచమ్మ తల్లి నగలను శనివారం దిలావర్‌పూర్ మండలంలోని సాంగ్వి గ్రామానికి చేర్చిన భక్తబృందం పోచమ్మ ఆలయ ప్రాంగణంలో జాగారం చేస్తారు. ఆదివారం గోదావరి నదిలో అమ్మవారి నగలను శుద్ధిచేసి దిలావర్‌పూర్ మండలం మీదుగా అడెల్లి బయలుదేరుతారు. అమ్మవారి నగలకు బండారు పూసి కొబ్బరి నీళ్లు చల్లి మొక్కులు చెల్లించుకోవడానికి అశేష భక్తజనం వస్తారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఎస్సై సందీప్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

పూల పరిమళం.. ఆరోగ్యదాయకం



బతుకమ్మ పూలు ఇవే..
ఈ సీజన్‌లో బంతి, చామంతి, తామర, అల్లి, గడ్డిపువ్వు, వామపువ్వు, కట్ల, టేకు, [illegible], సీతజడలు, మందార, తంగేడు, బీర, కాకర, గునుగు, గుమ్మడి, దోస, తదితర పూలు వికసిస్తాయి.

● బతుకమ్మలో దాగున్న శాస్త్రీయత



న్యూస్‌టుడే, ఆదిలాబాద్ సాంస్కృతికం : ప్రకృతి ప్రసాదించిన బతుకమ్మ పండుగలో చిన్నారులు, యువతులు, మహిళలు భాగస్వాములవుతారు. తొమ్మిది రోజులు ఆడిపాడుతూ బతుకమ్మ చుట్టూ ప్రదక్షిణలు చేస్తారు. ఈ క్రమంలో పూల నుంచి వెలువడే సువాసనలు, వాటి స్పర్శ మహిళల ఆరోగ్యాన్ని పెంపొందిస్తాయని ఆయుర్వేద వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. ఈ ఉత్సవంలో ఆహ్లాదంతోపాటు ఆరోగ్యం దాగి ఉందని శాస్త్రీయంగా రుజువైన నేపథ్యంలో 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం.

చామంతి

చామంతి పూలతో చర్మ సమస్యలు దూరమవుతాయి. జ్వరం, కీళ్ల నొప్పులు తగ్గడానికి దోహదం చేస్తాయి. నిద్రలేమి, ఒత్తిడిని తగ్గిస్తాయి.

బంతిపూలు

బంతిపూల సుగంధ వాసన జలుబు నుంచి ఉపశమనాన్ని కలిగిస్తుంది. కడుపులోని నులి పురుగుల వ్యాధి నివారణకు వాడతారు. ఈ పూల తైలం రక్తస్రావం తగ్గడానికి, కేశాలు పెరగడానికి ఔషధంగా ఆయుర్వేద వైద్యంలో ఉపయోగిస్తారు.

కాకర పూలు

కాకర కాయ, వాటి పూలు మధుమేహ వ్యాధిగ్రస్థులకు దివ్యౌషధంగా పని చేయడమే కాకుండా వారి మానసిక స్థితిని ఉత్సాహంగా ఉంచుతుంది. యాంటిబయాటిక్స్ మందుల తయారీలో కాకర పూల తైలాన్ని ఉపయోగిస్తుంటారు. జీర్ణ వ్యవస్థను మెరుగుపరుస్తుంది.

గునుగు

ఈ పువ్వులను అతిసార, క్షయ వ్యాధుల నివారణకు ఔషధంగా వాడతారు. ఈ పూల పొడి పెద్ద పేగులోని బద్దె పురుగులను తొలగించడానికి, కంటి సంబంధ రోగ నివారణకు ఉపయోగిస్తారు. మధుమేహం, నోటి పుండ్లు, ముక్కులో రక్తస్రావం తగ్గడానికి ఉపయోగిస్తారు. రక్తపోటును అదుపులో పెడుతుంది.

తంగేడు

దీని ఆకులు, పువ్వుల చూర్ణాన్ని కామెర్లు, తామర లాంటి చర్మ వ్యాధుల నివారణకు ఉపయోగిస్తారు. చెక్కను ఉదరకోశ వ్యాధులకు మందుగా, కళ్లకలక నుంచి ఉపశమనం పొందడానికి ఉపయోగిస్తారు.

గడ్డిపువ్వు

గడ్డి పువ్వును ఆయుర్వేద వైద్యంలో యాంటిబయాటిక్‌గా వాడతారు. రక్తస్రావాన్ని నియంత్రించేందుకు ఇప్పటికీ మారుమూల గ్రామాల్లో, తండాల్లో, పల్లెల్లో ఈ పూలరసాన్ని ఉపయోగిస్తున్నారు.

గుమ్మడి

శరీర ఉష్ణోగ్రత సమతుల్యం ఉంచేందుకు వీటి పూలు ఆయుర్వేద వైద్యంలో వాడతారు. గుమ్మడి పువ్వు రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. ఈ పూలలో ఎ-విటమిన్ అధికంగా ఉండటంతో కంటి సంబంధిత రోగాలకు ఔషధంగా ఉపయోగిస్తారు. దగ్గు, జలుబు, వైరల్ జ్వరం తగ్గేందుకు వీటి పూలను మందుగా వాడతారు.

ఆరోగ్యానికి, పర్యావరణ పరిరక్షణకు దోహదం



- డా.అనికేత్ వైద్య, ఆయుర్వేద వైద్య నిపుణులు

బతుకమ్మలో వాడే పూలు మహిళల ఆరోగ్యాన్ని పెంపొందించడమే కాకుండా పర్యావరణాన్ని పరిరక్షిస్తాయి. ఆ పూలలో ఎన్నో ఔషధ గుణాలు ఉన్నాయి. ఆయుర్వేద వైద్యం తయారీలో వాటిని వాడతారు. మహిళలు బతుకమ్మల చుట్టూ ఆడే సందర్భంలో పూలనుంచి వచ్చే సువాసన, వాటి తాకిడితో జ్ఞానేంద్రియాలు ఉత్తేజితమవుతాయి. పూలను చూడటంతో కంటి చూపు బాగు పడుతుంది. ఏకాగ్రత పెరుగుతుంది. మానసిక ఒత్తిడి తగ్గుతుంది. ఈ నవరాత్రులు బతుకమ్మ ఆడే క్రమంలో వారికి తెలియకుండానే కొన్ని రుగ్మతలు వాటంతట అవే తగ్గిపోతాయి. వర్షాకాలంలో వాగుల్లో, నదిలో కొత్త నీరు చేరుతుంది. సామూహికంగా బతుకమ్మలను నీటిలో నిమజ్జనం చేయడంతో హానికారక క్రిమికీటకాలు నశిస్తాయి. కొన్ని పూలు నీటిని శుద్ధి చేసి జలజీవులను బతికిస్తాయి. నైవేద్యాన్ని సమర్పించడంతో నీటిలోని జీవులకు అవి ఆహారంగా అవుతాయి.


విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య, ఇన్‌ఛార్జి ఉపకులపతి వెంకటరమణ

వసతిగృహాల్లో సిబ్బంది కొరత

● ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ దృష్టికి ఆర్జీయూకేటీ సమస్యలు

ముథోల్(బాసర), న్యూస్‌టుడే: బాసర ఆర్జీయూకేటీలోని సమస్యలను పరిష్కరించాలని విద్యార్థులు ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య దృష్టికి తీసుకెళ్లారు. ఆర్జీయూకేటీని శుక్రవారం ఆయన సందర్శించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ భోజనశాల నిర్వాహకులు పట్టిక పాటించడం లేదని, ఇష్టానుసారంగా భోజనం పెడుతున్నారని, గడువు ముగిసినా కొత్త నిర్వాహకులను ఏర్పాటు చేయడం లేదన్నారు. విశ్వవిద్యాలయంలో చీఫ్ వార్డెన్ శ్రీధర్ ప్రవర్తన బాగా లేదని వెంటనే మార్చాలని పలువురు విద్యార్థులు కమిషన్ ఛైర్మన్‌కు ఫిర్యాదు చేశారు. విశ్వవిద్యాలయంలో 60 శాతం బాలికలున్నారని వారి వసతిగృహాల్లో కేర్ టేకర్ల(పోషకుల) కొరత ఉందన్నారు. అనంతరం పరిపాలన విభాగం కాన్ఫరెన్స్ హాల్‌లో ఇన్‌ఛార్జి ఉపకులపతి వెంకటరమణతో కలిసి అధ్యాపకులు, బోధనేతర సిబ్బందితో కలిసి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. చీఫ్ వార్డెన్ సమావేశానికి ఆలస్యంగా రావడం, విద్యార్థులు పలు ఆరోపణలు చేయడంతో ఆయనపై కమిషన్ ఛైర్మన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయనను తొలగించి నూతన వార్డెన్‌ను ఏర్పాటు చేయాలని ఆదేశించినట్లు తెలిసింది. మిగిలిన సమస్యలు పరిష్కరించకపోవడంతో సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక్కడి పరిస్థితులపై నివేదిక తయారు చేసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్కకు అందజేస్తానని చెప్పారు. తహసీల్దార్ పవన్‌చంద్ర, ఎస్సై గణేశ్, విశ్వవిద్యాలయ పరిపాలన విభాగం అధికారి రణధీర్ తదితరులున్నారు.


రాష్ట్ర స్థాయి పోటీలకు పయనమైన ఉమ్మడి జిల్లా బాలుర జట్టుతో విద్యాధికారి యాదయ్య తదితరులు

రాష్ట్రస్థాయి పోటీలకు ఉమ్మడి జిల్లా ఫుట్‌బాల్ జట్లు

మంచిర్యాల సిటీ, న్యూస్‌టుడే : పాఠశాల క్రీడా సమాఖ్య భద్రాద్రి కొత్తగూడెం, మెదక్ జిల్లాల్లో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఉమ్మడి జిల్లా జట్లు పయనమయ్యాయి. అండర్-17 బాలబాలికల విభాగంలో శనివారం (బాలురు), ఆదివారం (బాలికలు) నుంచి పోటీలు ప్రారంభం కానుండగా ఆయా జట్ల క్రీడాకారులకు జిల్లా విద్యాధికారి యాదయ్య క్రీడా దుస్తులు అందజేశారు. అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సాంబమూర్తి, వ్యాయామ ఉపాధ్యాయులు రామ్మోహన్, బెల్లం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పల్లెల అభివృద్ధి భాజపాతో సాధ్యం

దస్తూరాబాద్, న్యూస్‌టుడే: ప్రజలంతా భాజపా వైపు చూస్తున్నారని ఎంపీ జి.నగేష్ అన్నారు. శుక్రవారం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా దస్తూరాబాద్ పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో కలిసి మాట్లాడారు. పల్లెల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు. ప్రజలంతా కాంగ్రెస్, భారాస పాలనలో విసిగిపోయారని, సభ్యత్వాలు విరివిగా చేసి, పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. అనంతరం రేవోజిపేట గ్రామానికి చెందిన కార్యకర్త బొమ్మెన రమేష్ రోడ్డు ప్రమాదంలో గాయపడగా వారి ఇంటికి వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. రాథోడ్ రితేష్, ఆకుల శ్రీనివాస్, కొడిమెల లక్ష్మణ్, వెంకటరమణ, సాగర్, రాజు, నాయకులున్నారు.


మాట్లాడుతున్న ఎంపీ నగేష్

ఇవీ జాగ్రత్తలు..



పోలీసులు, దర్యాప్తు సంస్థ ఏదైనా కేసు గురించి ఫోన్ ద్వారా ఆరా తీయవు. బ్యాంకు ఖాతా, ఆధార్‌కార్డు వంటి వివరాలు సేకరించవు. కేసు నమోదవ్వకుండా ఉండాలంటే డబ్బు పంపించాలని చెబితే మోసమని గుర్తించాలి. ఎవ్వరికీ పార్సిల్ పంపకున్నా ఇతర దేశాలకు మీ పేరుపై వెళ్తొందంటే నమ్మొద్దు. వివిధ దర్యాప్తు సంస్థల పేర్లతో ఫోన్లు చేస్తే వెంటనే స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలి. ఒకవేళ మోసపోయి డబ్బు కోల్పోతే టోల్‌ఫ్రీ 1930, స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలి.

'రెండు రోజుల క్రితం మంచిర్యాలకు చెందిన ఓ ప్రభుత్వ ఉద్యోగికి దిల్లీ పోలీసుల పేర్లతో ఫోన్లు వచ్చాయి. మీ అబ్బాయిని సైబర్‌క్రైంలో అరెస్టు చేశాం. మా ఖాతాలోకి డబ్బులు జమ చేయాలంటూ చెప్పగా సదరు ఉద్యోగి తేరుకొని మా అబ్బాయి ఇంట్లోనే ఉన్నాడని సమాధానం చెప్పడంతో నిందితులు ఫోన్లు చేయడం ఆపేశారు.'

సైబర్ వల.. చిక్కితే విలవిల

● దిల్లీ, ముంబయి సైబర్‌క్రైం అధికారులమంటూ ఫోన్లు



సైబర్ నేరం జరిగితే బాధితులు వెంటనే సైబర్‌క్రైం రిపోర్టింగ్ పోర్టల్ (ఎన్‌సీఆర్‌పీ) 1930 కాల్‌సెంటర్‌లో ఫిర్యాదు చేస్తారు. అయితే ఆ కాల్‌సెంటర్, సైబర్‌క్రైం పోలీసుల పేరుతోనే మోసం జరిగితే.. సైబర్ నేరగాళ్లు ఇప్పుడు చేస్తుందిదే. గతంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ), సీబీఐ, కస్టమ్స్ అధికారుల పేరుతో భయపెట్టి జనం డబ్బు కొల్లగొట్టిన సైబర్ నేరగాళ్లు కొంతకాలంగా రూటు మార్చారు. దిల్లీ, ముంబయి సైబర్‌క్రైం విభాగం, 1930 కాల్‌సెంటర్ అధికారులమంటూ వల విసురుతున్నారు.

–న్యూస్‌టుడే, మంచిర్యాల నేరవిభాగం, మందమర్రి పట్టణం,

మోసగిస్తారిలా..

డ్రగ్స్ పార్సిల్ కేసు దర్యాప్తులో భాగంగా అనుమానాస్పద లావాదేవీలు జరిగిన కొన్ని ఖాతాలు గుర్తించామని.. అందులో మీది ఉందంటూ ఫోన్ చేస్తున్నారు. అనుమానాస్పద లావాదేవీలు జరిగాయని, కొంత డబ్బు మీ ఖాతాలో జమయ్యిందంటూ వివరాలు సేకరిస్తున్నారు. కేసు దర్యాప్తుకు సెక్యూరిటీ డిపాజిట్ చేయాలని, మీ పాత్ర లేనట్లు తేలితే డబ్బు తిరిగి పంపిస్తామంటూ కొంత వసూలు చేస్తున్నారు.

'మందమర్రికి చెందిన ఓ ప్రైవేటు పాఠశాల కరస్పాండెంట్‌కు ఇటీవల పోలీసుల పేరుతో మాట్లాడి మీపై మనీ లాండరింగ్ కేసు ఉందని బెదిరించి విడతల వారీగా రూ. 1,43,75000 నిందితులు తమ ఖాతాలోకి జమ చేసుకున్నారు.'



మంచిర్యాలకు చెందిన ఓ ప్రభుత్వ ఉద్యోగికి వచ్చిన ఫోన్‌కాల్స్ జాబితా

జడ్జిలకు పదోన్నతులు

● మరికొందరికి స్థానచలనం

ఎదులాపురం, మంచిర్యాల న్యాయవిభాగం, న్యూస్‌టుడే : తెలంగాణ హైకోర్టు రాష్ట్ర వ్యాప్తంగా 38 మంది జూనియర్ సివిల్ జడ్జిలకు సీనియర్ సివిల్ జడ్జిలుగా పదోన్నతులు కల్పిస్తూ, మరో 32 మందికి స్థాన చలనం కల్పిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఉమ్మడి జిల్లాలో ఒకరు పదోన్నతి పొంది మరో జిల్లాకు బదిలీ అయ్యారు. ఇతర జిల్లాల నుంచి ఇద్దరిని ఉమ్మడి జిల్లాకు బదిలీ చేశారు.

న్యాయమూర్తి	ప్రస్తుత స్థానం	బదిలీ
పదోన్నతులు పొంది బదిలీ అయిన వారు		
మంజుల సూర్యవార్	జూనియర్ సివిల్‌జడ్జి ఆదిలాబాద్	సీనియర్‌సివిల్‌జడ్జి నకిరేకల్(నల్గొండ)
డి. రామ్మోహన్‌రెడ్డి	„ „ ములుగు	„ „ మంచిర్యాల
సి. సంపత్	„ „ మంచిర్యాల	„ „ మంచిర్యాల
స్థాన చలనం అయిన వారు		
జి. శ్రీనివాస్	సీనియర్ సివిల్ జడ్జి నారాయణపేట్	సీనియర్ సివిల్ జడ్జి నిర్మల్
గవ్వల రాధిక	„ „ నిర్మల్	డీఎల్ఎస్ఏ కార్యదర్శి నిర్మల్
అర్పిత మారంరెడ్డి	„ „ మంచిర్యాల	„ „ మంచిర్యాల

గుమ్మడి కాయంత పరిమాణం.. ద్రాక్షపండు రుచి


చెట్టుకు కాసిన పనర పనస పండ్లు

పెద్ద సైజులో ఉన్న ఈ కాయలను చూసిన వారు ఇవేమని ఆశ్చర్యపోతున్నారు. ఇది గోల్డెన్ బ్లూమ్ గ్రాఫ్టెడ్ పొమెలో ఫ్రూట్ లేదా పనర పనస లేదా గజ నిమ్మ అంటారు. ఇవి ఆగ్నేయ ఆసియా దేశాల్లో ఎక్కువగా కనిపిస్తాయి. ఖానాపూర్ మండలం మస్కాపూర్ మధురానగర్ కాలనీకి చెందిన శ్రవణ్ తన ఇంట్లో అయిదేళ్ల కిందట నాటిన మొక్క పెద్దదై పండ్లను ఇస్తోంది. గుమ్మడికాయ సైజులో ఈ పండ్లు కాస్తాయని, ద్రాక్షపండు రుచిని పోలి ఉంటుందని శ్రవణ్ చెప్పారు. ఈ పండులో పొటాషియం, విటమిన్-సి పుష్కలంగా ఉంటాయని నిర్మల్‌కు చెందిన వృక్ష శాస్త్ర ఉపాధ్యాయుడు మోహన్‌రావ్ తెలిపారు. -న్యూస్‌టుడే, ఖానాపూర్

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)
ఆదిలాబాద్: 91541 18155
ఇచ్చోడ: 94935 57309
బోథ్: 91548 46671
ఉట్నూరు: 94410 86640

న్యూస్‌టుడే, ఇచ్చోడ

? ఇచ్చోడ మండలం దుబార్‌పేట్‌లో విద్యుత్ దీపాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుంది. బతుకమ్మ సంబరాలు చేసుకునే పరిస్థితి లేదు. - స్థానికుడు, దుబార్‌పేట్

✔ సమస్యను పరిష్కరించి ఇబ్బందులు తీర్చేలా చూస్తాం. - లక్ష్మణ్, ఎంపీడీఓ

న్యూస్‌టుడే, గుడిహత్నూర్

? గుడిహత్నూర్‌లోని పలు కాలనీల్లో ఖాళీగా ఉన్న స్థలాల్లో వ్యర్థాలు వేస్తున్నారు. పిచ్చిమొక్కలు పెరిగి దోమలు, విషపురుగులతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. - శ్రీనివాస్, గుడిహత్నూర్

✔ ఖాళీ స్థలాల్లో వ్యర్థాలు, పిచ్చిమొక్కలు తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం. - రాందాస్, పంచాయతీ కార్యదర్శి, గుడిహత్నూర్

న్యూస్‌టుడే, ఆదిలాబాద్ అర్బన్

? ఆదిలాబాద్ పట్టణంలోని 170 కాలనీలో వీధి కుక్కల బెడద ఎక్కువగా ఉంది. రోడ్లపై అవి గుంపులుగా తిరగడంతో కాలనీవాసులు భయాందోళన చెందుతున్నారు. - లింగన్న, కాలనీవాసి

✔ కుక్కల పట్టివేత చర్యలు కొనసాగుతున్నాయి. త్వరలో 170 కాలనీలో వీధి కుక్కలను పట్టుకుని సంతాన నియంత్రణ శస్త్రచికిత్సలు చేయిస్తాం. - శంకర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్

వైభవంగా నవరాత్రి ఉత్సవాలు

ఇంద్రవెల్లి, న్యూస్‌టుడే : ఇంద్రవెల్లి మండల కేంద్రంతో పాటు ముత్నూర్, ధనోర(బి), దేవాపూర్, ఇన్కర్‌గూడ తదితర గ్రామాల్లో నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ముత్నూర్ గ్రామంలో ప్రతి రోజు అన్నదానం ఏర్పాట్లు చేసినట్లు గ్రామ పటేల్ పెందూర్ జంగు తెలిపారు. దుర్గాదేవి మండపాల వద్ద ప్రతి రోజు రాత్రి దాండియా సైతం ఏర్పాటు చేశారు.


ఇంద్రవెల్లిలో ప్రతిష్ఠించిన దుర్గాదేవి

ఒక్కేసి పువ్వేసి.. బతుకమ్మ ఆడేసి

బేల, న్యూస్‌టుడే : బేల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బతుకమ్మ సంబరాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు పూలతో బతుకమ్మను తీర్చిదిద్ది ఆడిపాడుతూ సందడి చేశారు. డీఐఈఓ రవీందర్‌కుమార్ వేడుకల్లో పాల్గొని బతుకమ్మకు పూజలు నిర్వహించారు. విద్యార్థులతో కలిసి బతుకమ్మ ఆడారు. ప్రిన్సిపల్ భగవాండ్లు, ఆదిలాబాద్ బాలుర, బాలికల కళాశాలల ప్రిన్సిపాళ్లు సూర్యప్రకాశ్, గణేశ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: మండల కేంద్రంలోని శీలంగూడలోని ప్రభుత్వ కళాశాలలో అధ్యాపకులు, విద్యార్థులు బతుకమ్మ సంబరాలను నిర్వహించారు. ప్రిన్సిపల్ మారుతి, అధ్యాపకులు ప్రమీల, సరితలతో పాటు బాలికలు పాల్గొన్నారు.


ఇంద్రవెల్లి ప్రభుత్వ కళాశాలలో..


బేల : బతుకమ్మ ఆడుతున్న డీఐఈఓ రవీందర్ కుమార్, ప్రిన్సిపల్ భగవాండ్లు

నేర వార్తలు

విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధం

గుడిహత్నూర్, న్యూస్‌టుడే : మల్కాపూర్ పంచాయతీలో శుక్రవారం విద్యుదాఘాతంతో ఓ ఇల్లు దగ్ధమైనట్లు గ్రామస్థులు తెలిపారు. గ్రామస్థులు, బాధిత కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మడవి దశరథ్ ఇంట్లో ఉదయం విద్యుత్తు షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. కుటుంబీకులు గమనించి బయటకు పరుగులు తీశారు. గ్రామస్థులు మంటలను ఆర్పివేశారు. ఆహార ధాన్యాలు, వస్తువులు పూర్తిగా కాలిపోయినట్లు తెలిపారు. రూ.2 లక్షల ఆస్తి నష్టం జరిగిందని పేర్కొన్నారు. బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.5 వేల నగదును అందజేశారు.

మహిళపై హత్యాయత్నం

ఇంద్రవెల్లి, న్యూస్‌టుడే : మండల కేంద్రంలోని బీంనగర్‌లో నివాసముండే చాట లక్ష్మిపై హత్యాయత్నం చేసిన బీంనగర్‌కు చెందిన షేక్ ఇమ్రాన్(35)పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై బీంరావు తెలిపారు. బీంనగర్ వీధిలో వితంతు మహిళ చాట లక్ష్మి తన పిల్లలతో నివసిస్తోంది. షేక్ ఇమ్రాన్ 2021లో లక్ష్మి వద్ద రూ.6 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. అప్పు తీర్చాలని పలుమార్లు పంచాయితీ పెట్టినా చెల్లిస్తానని మాట తప్పాడు. గురువారం మధ్యాహ్నం లక్ష్మి ఇంటికి వెళ్లిన ఇమ్రాన్ చంపేస్తానని దాడి చేశాడు. లక్ష్మి కేకలు వేయగా చుట్టుపక్కల వారు వచ్చి కాపాడారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

గొడ్డలితో దాడి.. ఇద్దరిపై కేసు

ఇంద్రవెల్లి, న్యూస్‌టుడే : ముత్నూర్ బస్టాప్ వద్ద దొనకొండ నరేష్‌పై గొడ్డలితో దాడి చేసిన వాగ్మారే కిషన్, వాగ్మారే విఠల్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై బీంరావు తెలిపారు. మండలంలోని చెందిన నరేష్ గురువారం ముత్నూర్ గ్రామానికి పని నిమిత్తం వచ్చాడని, గతంలో నరేష్ వల్లనే విష్ణు జైలు పాలయ్యాడనే కోపంతో గురువారం సాయంత్రం ఇద్దరు దాడికి తెగబడ్డారు. బాధితుడి తండ్రి వెంకటి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మట్కా జూదరుల అరెస్టు

ఇంద్రవెల్లి, న్యూస్‌టుడే : ఇంద్రవెల్లిలో ఆన్‌లైన్ ద్వారా మట్కా జూదమాడుతున్న ఇద్దరిని పట్టుకున్నట్లు ఏఎస్సై భీంరావు అన్నారు. మండల కేంద్రానికి చెందిన గోటే రాజేశ్ అలియాస్ రాజు, కేంద్రే సురేష్‌లు మహారాష్ట్రలోని బోరికి చెందిన అశోక్ సామ్రాట్, ప్రేమ్ సామ్రాట్‌లతో ఆన్‌లైన్‌లో మట్కా ఆడుతుండగా పట్టుకున్నట్లు తెలిపారు.


మల్కాపూర్‌లో ఎమ్మెల్యేకు స్వాగతం పలుకుతున్న గుస్సాడీలు

నియోజకవర్గ ప్రగతే లక్ష్యం : ఎమ్మెల్యే

గుడిహత్నూర్, న్యూస్‌టుడే : నియోజకవర్గ ప్రగతే తన లక్ష్యమని, గెలిపించిన ప్రజల వెన్నంటి ఉంటానని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. శుక్రవారం మండలంలోని మల్కాపూర్, కొత్వాల్‌గూడ, చిన్న మల్కాపూర్ గ్రామాల్లో పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యేకు గుస్సాడీలు స్వాగతం పలికారు. గుడిహత్నూర్ సహకార సంఘం ఛైర్మన్ సంజీవ్ ముండే, మాజీ ఎంపీపీ జ్ఞాను కేంద్రే, ఇచ్చోడ మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ తిరుమల్‌గౌడ్, నాయకులు సుధాకర్, మాధవ్, భీంరావు, జంగు, రాందాస్, ఆశన్న పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం

బేల, న్యూస్‌టుడే : బేల మండలం మహారాష్ట్ర సరిహద్దు కామ్‌గార్‌పూర్ సమీపంలోని పెన్‌గంగ నుంచి అక్రమంగా ఇసుకు తరలిస్తున్నారనే సమాచారంతో శుక్రవారం మైనింగ్, రెవెన్యూ, పోలీసు అధికారులు కలిసి సంయుక్తంగా దాడులు నిర్వహించారు. అధికారుల రాకను గమనించిన అక్రమార్కులు వాహనాలను వదిలి పరారయ్యారు. ఏడీ రవీందర్, తహసీల్దార్ కె.రఘునాథ్ కలిసి ఇసుకను తరలించే వాహనాలు, పని సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ఇసుకను తోడుతున్న 3 ఆయిల్ ఇంజిన్ బోట్లు, 3 జేసీబీలు, రెండు టిప్పర్లు, రెండు ట్రాక్టర్లు, వాటి పని సామగ్రి, పెన్‌గంగలో నిల్వ ఉంచిన 15 ట్రాక్టర్ల ఇసుకను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ సీజ్ చేసిన వాహనాలను ఆర్ఐకి అప్పగించామని తెలిపారు. ఉప తహసీల్దార్ వామన్, మైనింగ్ టీఏ రమేష్, ఏఎస్ఐ జీవన్, ఆర్ఐ అశోక్ ఉన్నారు.


సీజ్ చేసిన బోటు వద్ద తహసీల్దార్ రఘునాథ్, అధికారులు

బోథ్‌లో పోటాపోటీగా సోయా కొనుగోళ్ల ప్రారంభం

బోథ్, న్యూస్‌టుడే : బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో పీఏసీఎస్(ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం) చేపడుతున్న సోయా కొనుగోళ్ల ప్రారంభం మండలంలో రాజకీయ దుమారం రేపింది. శుక్రవారం పోటాపోటీగా కాంగ్రెస్, భారాస నాయకులు ఎవరికి వారు సోయా కొనుగోళ్లను ప్రారంభించారు. అధికార పార్టీకి చెందిన ఏఎంసీ ఛైర్మన్ గంగారెడ్డి, భారాస ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఎవరికి వారు తాము సోయా కొనుగోళ్లను ప్రారంభిస్తామని గురువారం ప్రకటించారు. శుక్రవారం తొలుత కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి గజేందర్ ఆధ్వర్యంలో ఏఎంసీ ఛైర్మన్ గంగారెడ్డి స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి ఉదయం 10 గంటలకు సోయా కొనుగోళ్లను ప్రారంభించారు. అనంతరం గంటన్నర వ్యవధిలో భారాసకు చెందిన ఎమ్మెల్యే అనిల్ జాదవ్, జిల్లా అదనపు పాలనాధికారి శ్యామలదేవి, మార్క్‌ఫెడ్ డీఎం ప్రవీణ్‌రెడ్డి, డీసీవో మోహన్, మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్, స్థానిక భారాస నాయకులతో కలిసి సోయా కొనుగోళ్లను ప్రారంభించారు. కాంగ్రెస్ నాయకులు ముందుగా కొనుగోళ్లను ప్రారంభించటంపై ఎమ్మెల్యే సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కొనుగోళ్లను ప్రారంభించిన వారిపై, ప్రోటోకాల్ ఉల్లంఘించిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని, పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని పీఏసీఎస్ అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు ప్రోటోకాల్ ఉల్లంఘించిన జిల్లా అదనపు పాలనాధికారి, మార్క్‌ఫెడ్ డీఎం, డీసీవోలపై జిల్లా పాలనాధికారికి ఫిర్యాదు చేస్తామన్నారు.


బోథ్‌లో సోయా కొనుగోళ్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్, అదనపు పాలనాధికారి శ్యామలదేవి, మార్క్‌ఫెడ్ డీఎం ప్రవీణ్‌రెడ్డి, డీసీవో మోహన్


ప్రారంభిస్తున్న ఏఎంసీ ఛైర్మన్ గంగారెడ్డి, చిత్రంలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి గజేందర్

ఎస్సీ వర్గీకరణ అమలు ఇంకెప్పుడు?

ఆదిలాబాద్ అర్బన్, న్యూస్‌టుడే : ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీం కోర్టు తీర్పునిచ్చి రెండు నెలలు గడిచాయని, ఇంకెప్పుడు అమలు చేస్తారని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఆరెల్లి మల్లేష్ మాదిగ ప్రశ్నించారు. శుక్రవారం పట్టణంలోని అంబేడ్కర్ భవన్‌లో ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల కార్యవర్గ సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ ఈ నెల 9న కలెక్టరేట్ వరకు నల్లజెండాలు ధరించి నిరసన ర్యాలీ చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. నాయకులు కాంబ్లె బాలాజీ, సుభాష్, ఎల్లన్న, గణేష్, వినయ్, రాంప్రసాద్, రాజేశ్వర్, రవి, సంజీవ్, ప్రణయ్, విలాస్ పాల్గొన్నారు.

ఏజెన్సీ అభ్యర్థుల ధర్నా

పాలనాప్రాంగణం, న్యూస్‌టుడే : డీఎస్సీ-2024 ఏజెన్సీ కోటా ప్రకటించిన తర్వాతే ఉపాధ్యాయ నియామకాలు జరపాలని డిమాండ్ చేస్తూ ఏజెన్సీ డీఎస్సీ సాధన కమిటీ కలెక్టరేట్ ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించింది. అధ్యక్షుడు సోమేష్ మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఇంద్రవెల్లికి వచ్చినప్పుడు జిల్లాను దత్తత తీసుకుని గిరిజనులకు న్యాయం చేస్తామని చెప్పారని గుర్తుచేశారు. ఇప్పుడు గిరిజనేతరులతో ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయడం విడ్డూరంగా ఉందన్నారు.



నినాదాలు చేస్తున్న ఏఐటీయూసీ అనుబంధ హమాలీ యూనియన్ నాయకులు

కార్మికుల వేతనాల పెంపుతో సంబరాలు

ఎదులాపురం, న్యూస్‌టుడే : పౌర సరఫరాల కార్మికుల వేతనాలను పెంచటం పట్ల ఏఐటీయూసీ అనుబంధ హమాలీల సంఘం శుక్రవారం సంబరాలు నిర్వహించింది. స్థానిక ఎన్టీఆర్ కూడలిలో బాణసంచా కాల్చి ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.విలాస్ మాట్లాడుతూ హమాలీల కూలీ ధరలు పెంచాలంటూ గురువారం రాష్ట్ర శాఖ కమిషనర్‌ను కలవడానికి వెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించి ధరలు పెంచటంతో పాటు ఇతర సమస్యలు పరిష్కరించటానికి హామీ ఇచ్చారన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి దేవేందర్, హమాలీ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎస్‌కే అఫ్రోజ్, నాయకులు ఊషన్న, లక్ష్మీపతి, సలీం, జమ్ము, విశాల్ తదితరులు పాల్గొన్నారు.

పొగాకు వినియోగం వీడితేనే ఆరోగ్యం

ఆదిలాబాద్ వైద్య విభాగం, న్యూస్‌టుడే : పొగాకు, దాని ఉత్పత్తులను వినియోగించటం వల్ల క్యాన్సర్, గుండెపోటు లాంటి భయంకర వ్యాధుల బారిన పడతామని జిల్లా పొగాకు నియంత్రణ విభాగం సైకాలజిస్ట్ శ్రీకాంత్ పేర్కొన్నారు. స్థానిక పుత్లీబౌలి పట్టణ పీహెచ్‌సీ వద్ద అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా ఎన్‌సీడీ సమన్వయకర్తలు వెంకటరమణ, శ్రీనివాస్, సోషల్ వర్కర్ చిరంజీవి, ఆరోగ్య కేంద్రం సీవో నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

న్యాయవాదుల ఆందోళన

ఎదులాపురం, న్యూస్‌టుడే : న్యాయవాదుల పట్ల పోలీసులు తమ వైఖరి మార్చుకోవాలంటూ ఆదిలాబాద్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక కోర్టు సముదాయాల ప్రధాన ద్వారం వద్ద న్యాయవాదులు బైఠాయించి ధర్నా చేపట్టారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నగేష్ మాట్లాడుతూ హైదరాబాద్‌లో హైడ్రా బాధితుల తరపున నిలబడిన ఖలీం అనే వకీలు పట్ల పోలీసులు అవలంబించిన తీరును తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. న్యాయవాదులు రహీం, సంతోష్, అమరేందర్‌రెడ్డి, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.


కోర్టు ప్రధాన గేటు వద్ద ధర్నా చేస్తున్న న్యాయవాదులు

రెండోరోజు భోజనం పెట్టారు

పాలనాప్రాంగణం: 'ఈనాడు' చొరవతో గురువారం 300 మంది డీఎస్సీ అభ్యర్థులకు భోజనం పెట్టిన పీఆర్‌టీయూ సభ్యులు రెండో రోజూ ఆ కార్యక్రమం కొనసాగించారు. డీఈవో ప్రణీత అభ్యర్థులకు స్వయంగా వడ్డించారు. ఉపాధ్యాయ సమస్యలను ప్రస్తావించడంలోనే కాకుండా సామాజిక సేవలోనూ పీఆర్‌టీయూ ముందంజలో ఉందని కొనియాడారు. సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొమ్ము కృష్ణకుమార్, టీఎన్.స్వామి, గౌరవ అధ్యక్షుడు గోవర్ధన్, రాష్ట్ర జిల్లా బాధ్యులు చోప్డే రాజు, ఈశ్వర్, జక్కుల రవి, గంగాధర్ తదితరులు దగ్గరుండి ఏర్పాట్లు పర్యవేక్షించారు.



ముచ్చటగా మూడో ఉద్యోగానికి సోదరుల ఎంపిక

పాలనాప్రాంగణం, న్యూస్‌టుడే : ఒక ఇంట్లో ఒక ఉద్యోగం సాధిస్తేనే సంబరపడుతున్న రోజులివి. అలాంటిది సోదరులిద్దరూ ఏకంగా మూడు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఇది వరకు చేసిన ఉద్యోగాలకు స్వస్తి పలికి ఎంతో ఇష్టమైన ఉపాధ్యాయ కొలువుకు జై కొట్టారు. వారే ఆదిలాబాద్ పట్టణం కుమార్‌పేట్ కాలనీకి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు పోతగంటి రాములు-లక్ష్మి దంపతుల కుమారులైన పోతగంటి ప్రశాంత్, ప్రవీణ్. వీరు ఇది వరకే రెండు ఉద్యోగాలకు ఎంపిక కాగా.. తాజాగా డీఎస్సీ ఫలితాల్లోనూ సత్తా చాటి శుక్రవారం డైట్ కళాశాలలో జరిగిన ధ్రువపత్రాల పరిశీలనకు హాజరయ్యారు. ప్రశాంత్ పంచాయతీ కార్యదర్శిగా పని చేస్తూ మహాత్మాజ్యోతి బాపులే గురుకుల విద్యాలయంలో పీఈటీగా ఇటీవల నియామక పత్రం అందుకున్నారు. కౌన్సెలింగ్‌లో పోస్టింగ్ తీసుకోవడమే మిగిలి ఉండగా.. తాజాగా డీఎస్సీ ఫలితాల్లో స్కూల్‌అసిస్టెంటు సోషల్‌లో అయిదో ర్యాంకును సాధించారు. నాన్నబాటను ఎంచుకుని ఉపాధ్యాయుడిగా పని చేయాలన్న కల నెరవేరడం ఆనందంగా ఉందని ప్రశాంత్ చెప్పారు. మరోవైపు ప్రవీణ్ తొలుత రైల్వే టికెట్ కలెక్టర్‌గా కేంద్ర ప్రభుత్వ కొలువుకు ఎంపికైనా అందులో చేరలేదు. ఆ తర్వాత ఎస్‌ఐ రిక్రూట్‌మెంటులో 2020లో రిజర్వు సబ్ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఎస్సై)గా ఎంపికై యాపల్‌గూడ బెటాలియన్‌లో విధులు నిర్వహిస్తున్నారు. జిల్లాస్థాయిలో రెండో ర్యాంకుతో ఎస్‌ఏ ఫిజికల్ డైరెక్టర్‌గా ఎంపికై కొలువును ఖాయం చేసుకున్నారు. 35 ఏళ్ల వయసులో పెళ్లయి అటు కుటుంబ బాధ్యతలు మోస్తూనే పోటీ పరీక్షలకు సన్నద్ధమై ఒక్కొక్కరు మూడేసి కొలువు సాధించి ఔరా అనిపిస్తున్నారు.


ప్రశాంత్, ప్రవీణ్

నిరుపేద శవానికి అంత్యక్రియలు

ఎదులాపురం, న్యూస్‌టుడే : మావల గ్రామంలో భిక్షాటన చేస్తూ గురువారం ఉదయం మృతి చెందిన వ్యక్తి మృతదేహానికి బెస్ట్ ఫ్రెండ్స్ హెల్ప్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం అంత్యక్రియలు నిర్వహించారు. పోలీసులు మొదట అనాథ శవంగా కేసు నమోదు చేయగా దర్యాప్తులో మహారాష్ట్ర యావత్మాల్ జిల్లా అర్నీ తాలూకా బండారిజాగీర్‌కు చెందిన వ్యక్తిగా గుర్తించారు. శుక్రవారం అతడి మేనమామ జగన్నాథ్ సట్వాజీ సోలంకికి మృతదేహాన్ని పోలీసులు అప్పగించారు. అంత్యక్రియలకు డబ్బులు లేవని అతడు చెప్పటంతో సొసైటీ వారు అంత్యక్రియలు నిర్వహించారు. సొసైటీ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, సభ్యులు దమ్మకీర్తి పాల్గొన్నారు. అనాథ శవాలు ఉన్నా, అంత్యక్రియలు చేసే ఆర్థిక స్తోమత లేకున్నా 94414 59010కు సమాచారం అందిస్తే సాంప్రదాయబద్ధంగా అంత్యక్రియలు నిర్వహిస్తామని అబ్దుల్ అజీజ్ పేర్కొన్నారు.

హైడ్రాను అడ్డుకుంటాం

ఉట్నూరు గ్రామీణం, న్యూస్‌టుడే : సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వం హైడ్రాను లక్కారం వరకు తీసుకొస్తే అడ్డుకునేందుకు నేను, రితేష్ రాథోడ్ ముందుంటామని ఎంపీ గోడం నగేష్ అన్నారు. శుక్రవారం ఉట్నూరు మండలం లక్కారం శిశు మందిర్ ప్రాంతంలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. జిల్లా కార్యదర్శి రమేష్, లింగాగౌడ్, జగన్, రవి, వెంకటేష్, దేవిదాస్, కె.రమేష్, హరిచంద్, శేషారావు, సుజాత, చంచలాబాయి, సత్తన్న, రవి పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల వద్దకు తీసుకెళ్లి.. భాజపాను స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిపించాలని ఎంపీ గోడం నగేష్ అన్నారు. శుక్రవారం మండలంలోని ధనోర(బి) గ్రామంలో భాజపా సభ్యత్వ కార్యక్రమానికి హాజరయ్యారు. ధనోర(బి)లో ప్రజలతో సభ్యత్వ నమోదు చేయించారు. రితేష్ రాథోడ్, రాజు, రాజలింగు, భాజపా నాయకులు పాల్గొన్నారు.


లక్కారంలో సభ్యత్వ నమోదులో ఎంపీ గోడం నగేష్

సర్వేలో పొరపాట్లకు తావివ్వొద్దు

ఆదిలాబాద్ అర్బన్, న్యూస్‌టుడే : ప్రభుత్వం ప్రవేశపెట్టిన కుటుంబ డిజిటల్ కార్డు సర్వేలో పొరపాట్లకు తావివ్వొద్దని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. శుక్రవారం బల్దియాలోని 11వ వార్డులో కొనసాగుతున్న సర్వే తీరును కలెక్టర్ పరిశీలించారు. పుర కమిషనర్ ఎండీ ఖమర్ అహ్మద్, మావల తహసీల్దార్ వేణుగోపాల్, కౌన్సిలర్ షానవాజుర్ రెహ్మాన్ తదితరులున్నారు.

ముప్కాల్ ఎంపీడీవో మృతి

ముప్కాల్, బాల్కొండ, న్యూస్‌టుడే: రహదారి ప్రమాదంలో గాయపడిన ముప్కాల్ ఎంపీడీవో మహ్మద్ ముజఫరొద్దీన్(58) హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారు. ఆదిలాబాద్‌కు చెందిన ఈయన గత ఫిబ్రవరిలో ముప్కాల్ ఎంపీడీవోగా బదిలీపై వచ్చారు. విధి నిర్వహణలో భాగంగా గత నెల 30న ఆదిలాబాద్ నుంచి ముప్కాల్‌లో బస్సులో వచ్చారు. బస్సు దిగి మండల పరిషత్తు కార్యాలయానికి నడుచుకుంటూ వెళ్తుండగా ద్విచక్రవాహనదారుడు ఢీ కొట్టాడు. తలకు తీవ్ర గాయాలు కావడంతో వెంటనే చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు.

సంక్షిప్తం

రేపు బంజారా సేవా సంఘం జిల్లా కార్యవర్గం ఎన్నికలు

ఎదులాపురం: బంజారా సేవా సంఘం జిల్లా నూతన కార్యవర్గం ఎన్నికలను ఈ నెల 6న నిర్వహించనున్నట్లు రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాఠోడ్ బాబూలాల్ ప్రకటించారు. నాయకులు రామారావు, బలిరాంనాయక్, వినాయక్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలీ సంక్షేమ సంఘం జిల్లా కార్యవర్గం రద్దు

ఎదులాపురం: పద్మశాలీ సంక్షేమ సంఘం పదవీ కాలం పూర్తవడంతో రద్దు చేసినట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షురాలు మంచికట్ల ఆశమ్మ ప్రకటించారు. స్థానిక పాత్రికేయ ప్రాంగణంలో ఆమె సంఘం నాయకులతో కలిసి మాట్లాడారు. నాయకులు దత్తు, నరేష్, మోహన్, అడెల్లు, వెంకన్న, గణేష్, హనుమాండ్లు తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు ప్రత్యేక కౌంటరు

బోథ్: బోథ్ మండలంలో 2021 నవంబరు లోపు డిగ్రీ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ సుభాష్ చంద్ర శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బోథ్ తహసీల్దార్ కార్యాలయంలో ఓటరు నమోదు కోసం ప్రత్యేక కౌంటరును ఏర్పాటు చేశామన్నారు.

మంచి నీటి సహాయకులకు శిక్షణ

సిరికొండ: సిరికొండ మండల పరిషత్తు కార్యాలయంలో మంచి నీటి సహాయకులకు శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. భగీరథ ఏఈఈ జైపాల్, నీటి నాణ్యత నిపుణులు తిరుపతి, రవూఫ్ శిక్షణ అందించారు.

పెసా చట్టంపై అవగాహన

ఉట్నూరు గ్రామీణం: పెసా చట్టం పకడ్బందీగా అమలుకు పెసా సమన్వయకర్తలు ప్రజలకు ఐటీడీఏకు మధ్య వారధిగా ఉంటూ ముందుకెళ్లాలని ఐటీడీఏ ఏపీఓ జనరల్ వసంత్‌రావు అన్నారు. ఉట్నూరు కుమురం భీం ప్రాంగణం పీఎంఆర్‌సీలో షెడ్యూల్డు ప్రాంతాలకు పంచాయతీల విస్తరణ పెసా చట్టం అమలుపై సమన్వయకర్తలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. బీఎడ్ కళాశాల ప్రిన్సిపల్ మనోహర్, పెసా జిల్లా కోఆర్డినేటర్ అర్క వసంత్‌రావు మాట్లాడారు.

విద్యార్థినికి సన్మానం

పాలనాప్రాంగణం, న్యూస్‌టుడే : ఆదిలాబాద్ పట్టణం భాగ్యనగర్‌కు చెందిన మాజీ కౌన్సిలర్ మెస్రం కృష్ణ కూతురు శ్రద్ధ వరంగల్ ప్రతిమ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్‌లో ప్రవేశం పొందింది. ఎమ్మెల్యే పాయల్ శంకర్ విద్యార్థిని సన్మానించి అభినందించారు.

మత మార్పిడి కార్యక్రమాలు సరికాదు

నార్నూర్: మహారాష్ట్ర నుంచి వచ్చిన పలువురు పాస్టర్లు ఏజెన్సీ ప్రాంతంలో మత మార్పిడులకు పాల్పడుతున్నారని, వీటిని ఆపకపోతే ఉద్యమం చేపడతామని ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండల ప్రధాన కార్యదర్శి అర్క గోవింద్ హెచ్చరించారు. శుక్రవారం ఆయన మండల కేంద్రంలోని కుమురం భీం విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బాదిరావు, సెడ్మరావు, లింబారావు, హీరాలాల్ తదితరులున్నారు.

పిల్లలకు సకాలంలో వైద్య పరీక్షలు చేయించాలి

ఎదులాపురం: పిల్లలు ఏమాత్రం బలహీనంగా, నిరసంగా ఉన్నట్లు గమనించినా వెంటనే వైద్య పరీక్షలు చేయించి పోషకాహారాన్ని అందించాలని ఐసీడీఎస్ పీడీ ఎం.సబిత సూచించారు. జైనథ్ మండలం సైద్‌పూర్ అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె శుక్రవారం సందర్శించారు. జైనథ్ ప్రాజెక్ట్ ఏసీడీపీఓ నర్సమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

బోథ్: ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత లభిస్తుందని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఆడె గజేందర్ అన్నారు. ధన్నూర్-బి శబరిమాత ఆశ్రమంలో ఆధ్యాత్మిక కేంద్ర భవన నిర్మాణ పనులను శుక్రవారం ఏఎంసీ ఛైర్మన్ గంగారెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు.

ధర్నా విజయవంతం చేయాలి

ఇంద్రవెల్లి: ఆదివాసీల సమస్యలతో పాటు ఏజెన్సీలోని భూవివాదాలను ఐటీడీఏ పీఓ ఆధ్వర్యంలో పరిష్కరించాలనే డిమాండ్‌తో ఈ నెల 7న ఉట్నూరు ఐటీడీఏ ఎదుట తుడుందెబ్బ ఆధ్వర్యంలో నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని మండల అధ్యక్షుడు పుర్క చిత్రు అన్నారు.

యతి నర్సింహానంద సరస్వతిపై ఫిర్యాదు

ఆదిలాబాద్ నేర విభాగం: ప్రవక్త మొహమ్మద్(స)పై ఇటీవల అవమానకరంగా వ్యాఖ్యలు చేసిన యతి నర్సింహానంద సరస్వతిపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని కోరుతూ పలువురు ముస్లింలు శుక్రవారం ఆదిలాబాద్ వన్‌టౌన్ సీఐ సునీల్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. జాతీయ సమగ్రత, శాంతి, భద్రతలకు భంగం కలిగేలా వ్యాఖ్యలు చేసిన ఆయనపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.